


# కవికి విమర్శకుడూ కావాలి!

## కర్లపాలెం హనుమంత రావు

రచనకు ఒక పార్శ్వం రచయిత ఐతే రెండో పార్శ్వం రసాస్వాదన చేసే భావుకుడు.

అపారే కావ్య సంసారే కవిరేకః ప్రజాపతిః।

యథాస్మై రోచతే విశ్వం తథైవ పరివర్తతే- అని శ్లోకం॥

కవి తన ఇచ్ఛానుసారం చిత్రించడమే కాదు..ప్రజాపతి సృష్టించిన జగత్తు పోకడలను కూడా మార్చగలడు-అని అర్థం.

కవిలోని ఆ సృజనశక్తి సహజమైనది. కొంత మందికి అది గురుకృప తరువాత బైటపడుతుంది. కొంతమంది నిరంతర శాస్త్రాధ్యయనం ద్వారా మెరుగులు దిద్దుకుంటారు. ఎవరెట్లా సాధించినా పండితరాయలు సిద్ధాంతం ప్రకారం కవి అనేవాడికి 'అనాయాసంగా, అప్రయత్నంగా శబ్దార్థాలు స్ఫురించే ప్రతిభ పట్టుపబడటం' ప్రధానం.

రాజశేఖరుడు అనే మరో ఆలంకారికుడు ఈ ప్రతిభను రెండు రకాలుగా విభజించాడు.

కారయిత్రిఃకావ్యాన్ని సృజించే ప్రతిభ

భావయిత్రిఃకావ్యసౌందర్యాన్ని ఆస్వాదించగలిగే శక్తి

కారయిత్రి అధికంగా ఉంటే కవి .

భావయిత్రి అధికమైతే సద్విమర్శకుడు .

రచన పూర్తయిన తరువాత రచయితా విమర్శక అవతారం ఎత్తవచ్చు. కాని అది తన రచన వరకే పరిమితం . సాధారణంగా ఏ కవీ తనకు పనిపడితే తప్ప వేరే వారి రచనల జోలికి పోయే పని పెట్టుకోడు.

రచనలను చదివి తార్కికంగా ఆలోచించి సహృదయంతో విమర్శ చేయగల సత్తా ఉన్నవాడినే అసలైన విమర్శకుల లెక్కలోకి తీసుకోవాలి.

సరే...

కవి గొప్పా? విమర్శకుడు గొప్పా? అనే చర్చ సహజంగానే వస్తుంది.

కవి సృజన చేస్తేనే కదా...విమర్శకు భూమిక సిద్ధమయేది! కనుక కవే గొప్ప అని ఒక వాదం.

కానీ చాలా సందర్భాల్లో కవీ ఉహించని చమత్కారాలను విమర్శకుడు తన విస్తృత పరిశీలనా పాటవంతో వెలికి తీస్తుంటాడు.

"ఇయం సంధ్యా, దూరాదహముపగతోహన్త! మలయా

దిహైకాన్తే గేహే తరుణి! తవనేష్యామి రజనీమ్,

సమీరేణోక్తైవం నవకుసుమితా చూతలతికా

ధునానా మూర్ధానం నహి నహి నహీత్యేవ వదతి"- అని ఒక కవిగారి శ్లోకం.

''ఎక్కడో మలయపర్వతం నుంచీ వస్తున్నాను.కనుచీకటి పడుతున్నది. తరుణీ! నీ గృహంలో ఏకాంతంలో ఈరాత్రి గడుపుతాను'' అని సమీరం అడిగితే కొత్తగా పుష్పించిన చూతలత(బిడియంతో కాబోలు) 'వద్దు వద్దు వద్దు' అని ముమ్మారు తలడ్డంగా ఊపిందిట"

'శ్లోకం రసవత్తరంగానే సాగింది కానీ చివర్లో ఆ చూతలత మూడు సార్లు అలా వద్దొద్దొద్దని సాగదీయడం దేనికీ?' అని తర్కానికి దిగాట్ట ఒక విమర్శక శిఖామణి.' ముక్కు మొహం తెలీని పరాయి పురుషుడు రాత్రంతా ఇంట్లో ఉంటాననంటే ముగ్ధయిన పుష్పం మరి కంగారుపడదా! ఆ తొట్రుపాటులో 'వద్దు... వద్దు' అంది.తప్పా? అని కవిగారి వోట్రింపు.

'బాగుందండీ...మరి మూడోసారీ వద్దు అనెందుకన్నట్లో?" అని విమర్శకుడిగారి సందేహం.

కవిగారి దగ్గర సమాదానం లేదు. "చందస్సు కోసం అలా అన్నాను లేవయ్యా!" అని లోలోన గొణుక్కునుంటాడు పాపం. చందస్సుల్లో ఇమడటం కోసం ఇలా వ్యర్థప్రయోగాలు చేయాల్సి రావడం సంప్రదాయిక సాహిత్యంలోసాధారణమే. కానీ అలాంటి ప్రయోగాలవల్ల రచన ఔన్నత్యం పల్చబడతుంది. కవులందరికీ ఈ విషయమై మనసులొ మథనున్నా బైటికి ఒప్పుకోరనుకోండి.

ఇలాంటి సందర్భంలోనే విమర్శకుడి విశిష్టత బైటపడేది.ఇక్కడి శ్లోకం సంగతే చూసుకోండి...కవిగారిని ఇబ్బందినుంచీ విమర్శకుడు ఎంత తెలివిగా తప్పించాడో చూడండి! 'శ్లోకంలో కవిగారు సూచించింది వట్టి కుసుమితను కాదు..నవ కుసుమితను.అంటే అప్పుడే పుష్పించిన కుసుమాన్ని. ఆ పూలబాలకు పరాయిమగవాడితో మరీ మూడు రాత్రులంటే...బెదిరు పుట్టదా! అందుకే అసంకల్పితంగా నవకుసుమిత నోటినుంచీ 'వద్దు వద్దు వద్దు' అన్న మాట అలా మూడుసార్లు తన్నుకు వచ్చేసింది' అని సమన్వయం చేసేశాడు విమర్శకుడు గారు. కవిగారికి ఈ సమన్వయంతోనిజంగాఅ కళ్ళెంబడి నీళ్ళొచ్చేసే ఉంటాయి. ఆనందం ఆపుకోలేక అమాంతం విమర్శకుడిని ఆలింగనమూ చేసేసుకునుంటాడు.

అదీ సాహిత్య పరిశీలనలో విమర్శకుడి దృష్టి చతురత.

అలాగని కవి పాత్రను ఎంత మాత్రం తక్కువ చేయడం కానే కాదు. ఎవరి ప్రతిభ వారిది.

'గురూపదేశాదధ్యేతుం శాస్త్రం జడధియోఽప్యలమ్

కావ్యంతు జాయతే జాతు కస్య చిత్ప్రతిభావతః'- మందబుద్ధులు కూడా గురుశుశ్రూష వల్ల కొంత శాస్త్ర పాండిత్యం సాధించవచ్చు.కావ్యసృజన మాత్రం ఎప్పుడో ఒకసారి కాలం అనుకూలిస్తేనే చేయగలిగేది.అదీ వందలాది ప్రతిభావంతులలో ఏదో ఒక్కడు-అంటాడు భామహుడు.

కావ్యం అంతర్గతంగా మేలిమి బంగారమైతేనే ..ఏ విమర్శకుడైనా దాని వెలుగులను మెరుగుపెట్టకలిగేది!

చేమకూర వెంకటకవి 'విజయవిలాసమే' దీనికి చక్కని ఉదాహరణ.సాధారణంగా కావ్యం మొత్తంలో ఒక పది పన్నెండు చమత్కారాలు ద్యోతకమైతేనే మనం 'ఓహో..ఆహో' అంటుంటాం. రాసిన ప్రతి పద్యంలో ఏదో ఒక విశేషాన్ని దిగ్విజయంగా చొప్పించిన చేమకూరకవి ప్రతిభాపాటవాలను ఏమని పొగడగలం! కొన్ని కొన్ని పద్యాల్లో ఐతే కొన్ని వందల ఏళ్ళ దాకా అందులోని అందాలు బయటపడనేలేదు...తాపీ ధర్మారావు గారు 'హృదయోల్లాసం' పేరుతో సవివరవ్యాఖ్యానం చేసిందాకా.

ఉదాహరణకు ఒక పద్యం చూడండిః

కన్నె నగుమోము తోడం

బున్నమ చందురుని సాటి( బోలుప వచ్చున్

నెన్నెదురు తోడ మార్కొని

మున్నందఱు జూడ రేకమోవక యున్నన్-(1-197)

గతంలో(చిత్రాంగద నుదురుతో పోటీ పడి బహిరంగంగా అవమానం పాలైన సందర్భంలో) అపజయం పాలై ఉండకపోయుంటే పున్నమి చంద్రుణ్ణి ఈ కన్నె నవ్వుమొహంతో పోలిక పెట్టవచ్చు-అని కవి భావన. పున్నమి చంద్రుడిని మించిన అందమైన నవ్వుమొహం ఆ అమ్మాయిది అని కవి ధ్వని. అంతవరకూ బాగానే ఉంది కానీ..నాలుగో పాదంలోని ఆ 'రేక మోవక' అనే ప్రయోగానికి సమన్వయం ఎలా చెప్పాలో కొమ్ములు తిరిగిన పండితులకూ, పరిష్కర్తలకూ, వ్యాఖ్యాతలక్కూడా అంతు పట్టలేదు. జూలూరు అప్పయ్య గారు 'చిన్నదాని నొసటితో పడ్డ పోటీలో ఓడిపోయి చంద్రుడు లేఖలు మోసే పని చేయవలసి వచ్చింది' అని ఏదో పొసగని అర్థం చెప్పే ప్రయత్నం చేసారు. శబ్దరత్నాకరం 'రేక అనే పదానికి 'జాబు' అని ఒక్కర్థం మాత్రమే చెప్పూరుకోవడంతో వచ్చిన చిక్కు ఇదంతా. దాదాపు 300ఏళ్ళ పాటు చాలామంది ఇలా హైరానా పడ్డారు. నోరి వారి దగ్గర్నుంచీ వేదుల, బులుసు వారిదాకా అందరూ తమకు తోచిన ఏదో అర్థంతో సమన్వయం చేయబోయారు గానీ...కవి గారి అంతరంగంలోని అసలు భావం ఏమిటొ తాపీవారు తేల్చిన దాకా ఎవరికీ అంతుబట్టలేదు. 'రేక' అంటే 'గాయంతో శరీరంమీద పడ్డ గీత' అని చేమకూర వెంకటకవి భావం అని విజయవిలాసంలోని మరో పద్యం ఉదాహరణగా చూపించి ఒప్పించారు తాపీ వారు. మూడో అధ్యాయంలో అర్జునుడు సుభద్రను తీసుకుని పోయే సందర్భంలో బలరామునిసేనల్తో తలబడాల్సొస్తుంది. సుభద్ర యుద్ధంలో భర్తకు సాయం చేస్తుంది.

కృతజ్ఞతతో భార్యను ఆలింగనం చేసుకునే సమయంలో ఆమె వక్షస్థలానికి రాసుకునున్న కుంకుమరేఖలు చెమటకు తడిసి అర్జునుడి వంటిమీద కత్తిగాట్లులా పడతాయి.అర్జునుడు చమత్కారంగా

" ఒక్కంచుక రేకమోవని నా యురఃస్థలంబున

నీ కుచకుంకుమ రేఖ లంటించి మీ వారికి సూడు తీర్చితివి"అని పరిహాసం చేస్తాడు.ఇక్కడ 'రేకమోవని' పదానికి కత్తిగాయం అని తప్ప వేరే అర్థం కుదరదు కదా!

శత్రువు ఒంటిమీద ఒక్క దెబ్బైనా వేయకుండా ఓడిపోవడం యోధులకు అవమానం.తన అన్నగారిమీద ఆ అపనింద పడకుండా తన కుంకుమరేఖలతో అర్జునుడి వక్షస్థలంమీద కత్తిగాయంలా చేసి పుట్టింటివారి గౌరవాన్ని సుభద్ర కాపాడిందని కవిగారి చమత్కారం' అని తాపీ వారి అన్వయం.ఇదే అర్థాన్ని ముందటి పద్యానిక్కూడా అన్వయించుకుంటే చేమకూరగారి చమత్కారం చక్కిలిగిలి పెడుతుంది. 'చిత్రాంగదతో జరిగిన స్పర్థలో ఓడి వంటికి మచ్చతెచ్చుకోకుండా ఉండుంటే పున్నమి చంద్రుడు ఈ కన్నెనవ్వుమోముతో

పోలచుకోవడానికి పనికొచ్చేవాడు కదా!' అని కవిగారిభావం. తాపీవారి పుణ్యమా అని చేమకూర వెంకట కవి పద్యంలోని శ్లేష ఉపమాలంకారంతో కలసి ఎలాద్విగుణీకృతమయిందో చూశారా!

దేవదాసు సినిమాలో'కుడి ఎడమయితే పొరపాటు లేదోయ్..ఓడిపోలేదోయ్' అని ఒక పాట ఉంది.రచయిత సీనియర్ సముద్రాల.చాలా పాప్యులరయింది ఆ పాట. చిత్రవిజయోత్సవం జరిగే ఏదో ఒక సందర్భంలో వేదికమీదనున్న సముద్రాల గారిని ఎవరో గట్టిగా నిలదీశార్ట' కుడి ఎడమవడమేంటండీ అసలు...అర్థమేమన్నా ఉందా?' అంటూ. 'నిజమే కదా'అనిపిస్తుంది తరచి చూసేవాళ్ళకూ్కడా. కానీ రాసిన రచయితకు వివరణ ఇచ్చుకోవాల్సిన బాధ్యత ఉంది. సముద్రాల వారు లేచి నిలబడి సముద్రమంత గంభీరస్వరంతో ఇచ్చిన వివరణకు శ్రోతలు ఆగకుండా కరతాళధ్వనులు మొగించేశారని ఆరుద్ర ఒక సందర్భంలో రాశారు.ఇంతకీ ఆ మహాకవి ఇచ్చిన వివరణేంటీ?' అంటే 'కుడి ఎడమవడమంటే right left గా తిరగబడ్డం కాదు.కుడిభుజంలాంటి మనిషి దూరంగా జరిగిపోవడం(ఎడంగా వెళ్ళిపోవడం)అని.ఇలాంటి వివరణలివ్వాలంటే కవికి బహుముఖప్రజ్ఞ ఉండాలి.

బహుముఖ ప్రజ్ఞకి విస్తృతగ్రంధపఠనం,విశ్లేషణాత్మకమైన పరిశీలనానుభవం అవసరం.

ఊహ,భావన, బుద్ధి కవికి సహజంగా సిద్దించే వరాలైతే..బహుగ్రంథపఠనంతో విశ్లేషణ, పాఠకులతో నిరంతరసంపర్కం వల్ల సమాజధోరణి, విమర్శకులతో నిత్య సంభాషణవల్ల తప్పొప్పులు పసిగట్టగలిగే శక్తి మెరుగులు దిద్దుకుంటాయి.

తోచింది రాసేసినా..పదిమందిలోకి వదిలేసిన తరువాత..శల్యపరీక్షకు సిద్ధపడాలి.నిప్పులో కాలితేనే బంగారానికైనా మెరుగు. తనూ సమాజంలోని ఒక భాగమే కనక కావ్యమూ సమాజగతంగా సాగాలంటే కవి జనం మధ్యలో ఉండాలి.

విస్తృత పఠనం, విమర్శకు సహిష్ణుత అలవాటు చేసుకుంటేనే ఏ కవైనా ఎదిగేది. తనలోని విమర్శకుడు నిత్యచైతన్యంతో తొణికిసలాడుతుండాలంటే ఓపిక చేసుకుని తోటికవుల రచనలను విశ్లేషణాత్మక దృష్టితో చదవగలగాలి.చదువుతుండాలి.మంచి పసిగడితే మెచ్చుకునే సహృదయత పెంచుకోవాలి. ఒక్క ప్రశంసావాక్యం చాలు కవిని ఏనుగెక్కించడానికి. తప్పులుంటే సున్నితంగా విప్పిచెప్పి ముందుముందు మరింత మంచి సాహిత్యం సృజించడానికి తనవంతు సాయం చేయాలి.

అసూయాలు, అలకలు, అభాండాలు...అలౌకికులనుకునే కవులను శోభనివ్వవు.

విమర్శకుల పాత్ర ఎంత విశిష్టమైనదో కవులు గ్రహిస్తారని, కవుల కష్టం ఎంత విశేషమైనదో విమర్శకులు అర్థం చేసుకుంటారనే ఇంతగా ఇక్కడ వివరించే ప్రయత్నం చేసింది.

●●●

Post your comments